క్లుప్తంగా

కోడ్ ఉల్లంఘించిన అప్పన్న దేవస్థానం ఉద్యోగులు!

సింహాచలం: ఎన్నికల నియమావళిని సింహాచలం దేవస్థానం ఉద్యోగులు అతిక్రమించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవస్థానం అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు నామినేషన్ సందర్భంగా ఏకంగా విజయనగరం వెళ్లి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందించినట్టు ప్రచారం జరుగుతోంది. ఏఈతో పాటు సూపరింటెండెంట్, కాంట్రాక్ట్ ఉద్యోగి ఉన్నట్టు తెలుస్తోంది. వైదిక సిబ్బంది కూడా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి దేవస్థానంలో నిబంధనలు అమలు చేస్తున్నారు. వీఐపీలకు సైతం స్వామివారి దర్శనాల్లో నియమావళిని కచ్చితంగా పాటిస్తున్నారు. అలాంటిది ఉద్యోగులే కోడ్ నిబంధనలు ఉల్లంఘించి అత్యుత్సాహం ప్రదర్శించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలావుండగా స్వామివారి వార్షిక కల్యాణోత్సవానికి సంబంధించిన అక్షింతలు, ప్రసాదంతో పాటు మే 10న జరిగే చందనోత్సవానికి సంబంధించిన మినిట్స్‌ను అశోక్‌గజపతిరాజుకు ఇచ్చేందుకే సదరు ఉద్యోగులు వెళ్లినట్టు అధికారులు చెబుతున్నారు.

మరిడిమాంబ పండగకు వేళాయె


మరిడిమాంబ అమ్మవారు

పరవాడ: మండలంలోని రావాడ శివారు జల్లెలపాలెం గ్రామంలో కొలువుదీరిన మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ మేడిశెట్టి మాణిక్యం తెలిపారు. అమ్మవారిని దర్శించుకోవడానికి రావాడ పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో బారికేడ్లు, షామియానాలు వేశారు. తాగునీరు, మజ్జిగ, ఉచిత ప్రసాద పంపిణీకి ఏర్పాట్లు చేశారు. రాత్రికి డప్పులు, చిడతలు, తప్పెటగుళ్లు, కోయడ్యాన్సులు, నేల డ్యాన్సులు, భారీ బాణసంచా కాల్పులతో అమ్మవారి అనుపు మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరుపుతామని మాణిక్యం చెప్పారు.

ఆరో రోజు ఐదు నామినేషన్లు


నామినేషన్ వేస్తున్న బీఎస్పీ అభ్యర్థి రమణ

పెందుర్తి: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా పెందుర్తి నియోజక వర్గానికి ఆరో రోజు బుధవారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. జనసేన నుంచి పంచకర్ల రమేష్‌బాబు మూడు సెట్ల నామినేషన్లు వేయగా.. అదే పార్టీ నుంచి అతని సోదరుడు పంచకర్ల వెంకటేశ్వరరావు, రమేష్‌బాబు భార్య మహాలక్ష్మి నామినేషన్లు దాఖలు చేశారు. ఇండిపెండెంట్‌గా వద్దాది ఉదయ్‌కుమార్, బీఎస్పీ అభ్యర్థిగా బంగారి రమణ రిటర్నింగ్ అధికారి శేష శైలజకు నామినేషన్ పత్రాలు అందించారు. అభ్యర్థితో పాటు ఐదుగురిని మాత్రమే కార్యాలయంలోనికి అనుమతించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ ప్రక్రియకు గురువారం ఆఖరి రోజు అని ఆర్‌వో శేష శైలజ ప్రకటించారు.

వాడచీపురుపల్లి విద్యార్థి రఘుకు సత్కారం


రఘును సత్కరిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

పరవాడ: వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన దూడ రఘు పది పరీక్షల్లో 588 మార్కులు సాధించి అనకాపల్లి జిల్లాలో మూడో స్థానం సాధించాడు. అత్యధిక మార్కులు సాధించిన దూడ రఘును అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ బుధవారం తన కార్యాలయంలో సత్కరించి మెమొంటో బహూకరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం. పి.కనకేశ్వరరావు, ఉపాధ్యాయులు బి.అన్నాజీరావు, విద్యార్థి తల్లిదండ్రులు దూడ దేముడు, సూకమ్మ పాల్గొన్నారు.

బాగు బడి

- నాడు– నేడుతో అడవివరం హైస్కూల్‌కు మహర్దశ
- రెండు విడతల్లో రూ.1.06 కోట్లు మంజూరు
- చురుగ్గా సాగుతున్న పనులు

సింహాచలం: నాడు–నేడు పనులతో అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు నూతన శోభ చేకూరింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు తొలి దశలో రూ.46లక్షలతో, రెండోదశలో రూ.60 లక్షలతో పాఠశాలలో వసతులు కల్పిస్తోంది. తొలి దశలో రూ.46 లక్షలతో పాఠశాల భవనంతో కలిపి ఖాళీస్థలానికి ప్రహరీ నిర్మాణం, బోర్‌వెల్, విద్యార్థులు మంచినీరు తాగేందుకు ఆధునిక హంగులతో కుళాయిలు ఏర్పాటు చేశారు. రెండో దశలో రూ.60 లక్షలతో అదనపు అంతస్తులో ఆరు తరగతి గదుల నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. అలాగే పాఠశాల ప్రవేశ మార్గంలో అప్రోచ్ రోడ్డు, పాఠశాల ప్రాంగణమంతా సిమెంట్ కాంక్రీట్ ఫ్లోరింగ్ చేశారు. ఆవరణలో పెద్ద ఎత్తున సభావేదిక నిర్మించారు. విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు ఉన్న సుమారు రెండు ఎకరాల క్రీడా మైదానం లెవిలింగ్ పనులు చేశారు.

453 మంది విద్యార్థులు

పాఠశాలలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు దాదాపు 453 మంది విద్యార్థులు చదువుతున్నారు. 17మంది ఉపాధ్యాయులు పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. నాడు–నేడుతో పాఠశాలలో వసతులు సమకూరడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.


అడవివరం జెడ్పీ హైస్కూల్ భవనంపై నిర్మిస్తున్న అదనపు గదులు (ఇన్‌సెట్) ఏర్పాటుచేసిన కుళాయిలు

నాడు అరకొర సౌకర్యాలే..

అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్ భవనాలు బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ కారణంగా తొలగింపు ఆవశ్యమైంది. దీంతో సింహాచలం దేవస్థానం ప్రత్యామ్నాయ స్థలం ఇవ్వడంతో రెండతస్తుల్లో జిల్లా పరిషత్ నిధులతో పాఠశాల నూతన భవనం నిర్మించారు. నూతన భవనం అందుబాటులోకి వచ్చినా టీడీపీ ప్రభుత్వం సౌకర్యాలపై దృష్టి సారించలేదు. క్రీడా ప్రాంగణం ఉన్నా లెవిలింగ్ లేక ఆటలు ఆడుకునేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. పైగా కాంపౌండ్ వాల్ కూడా లేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పనులతో పాఠశాల రూపురేఖలు మార్చారు.దీంతో మా బడి బాగు పడిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


లెవిలింగ్ పనుల తర్వాత సమాంతరంగా మైదానం


పాఠశాలలోకి ప్రవేశించే ప్రధాన మార్గంలో వేసి సీసీ అప్రోచ్ రోడ్డు

అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి


సింహగిరిపై బీఫాంతో కుటుంబసమేతంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వచ్చే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసేందుకు పార్టీ అధిష్టానం ఇచ్చిన బీఫాంను వరాహ లక్ష్మీనృసింహస్వామికి చూపించి ఆశీస్సులు తీసుకున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: అడవివరంలో బీఆర్‌టీఎస్ విస్తరణ పనుల కారణంగా విద్యుత్ లైన్ల మార్పిడి పనుల నిమిత్తం ఈనెల 25 నుంచి 29 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా, కుమ్మరిదిబ్బ, అడవివరంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పంచకర్ల అత్యుత్సాహం

- అనుమతికి మించి వాహనాలతో ర్యాలీ
- నామినేషన్ కేంద్రంలోకి దూసుకెళ్లేందుకు గోడ దూకిన జనసేన కార్యకర్త
- పెందుర్తిలో అనుమతి లేకుండా బెలూన్ల ఏర్పాటు
- కేసు నమోదు చేసిన ఎన్నికల అధికారులు

పెందుర్తి: సందర్భం ఏదైనా జనసైనికుల వెకిలి చేష్టలకు అడ్డు ఉండడం లేదు. ఎక్కడ ఏం చేస్తున్నారో..ఎందుకు అరుస్తున్నారో..ఎవరిని ఏం అంటున్నారో తెలియని పరిస్థితిలో ఉన్నారు. పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు నామినేషన్ వేసిన సందర్భంలో కూడా జనసైనికుల పిల్ల చేష్టలు మరోసారి బయటపడ్డాయి. కొందరు పెందుర్తి ఆర్‌వో కేంద్రం వైపు గోడ దూకి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. నిషేధం ఉన్న ప్రాంతంలో గోడ దూకి ఆర్‌వో కార్యాలయం వైపు పరుగులు తీశారు. అయితే అక్కడే ఉన్న పోలీసులు వారిని చెదరగొట్టారు. అందులో ఒక జనసైనికుడు పోలీసులను సైతం పరుగులు పెట్టించాడు. నిబంధనలకు విరుద్ధంగా లోపలికి రావద్దని పోలీసులు చెబుతున్నా..కార్యకర్తలు హల్‌చల్ చేయడం కనిపించింది. ప్రచారంలో కూడా జనసేన నాయకులు నిబంధనలు అతిక్రమించారు. పెందుర్తి కూడలి వద్ద అనుమతి లేకుండా రెండు బెలూన్లు ఏర్పాటు చేశారు. జనసేన నాయకులు అనుమతి తీసుకోకపోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎంసీసీ టీం హెడ్ రవికుమార్ తెలిపారు. అలాగే అనుమతి తీసుకున్న వాటి కంటే ఎక్కువ వాహనాలు రావడంతో దానిపై కూడా ఉన్నతాధికారులకు నివేదిక అందించామన్నారు.


అధికారులు వారిస్తున్నా నామినేషన్ కేంద్రంలోకి వెళ్లడానికి ప్రయత్నించిన జనసేన కార్యకర్త

పదవుల కోసం దగ్గరయ్యారు

పెందుర్తి సీటు పంచకర్లకు కేటాయించడంతో ఏకంగా అధిష్టానంపైనే విమర్శలు గుప్పించిన బండారు ఒక్కసారిగా ప్లేటు పిరాయించారు. పంచకర్లకు ఎట్టి పరిస్థితిలోనూ మద్దతు ఇవ్వనని మీడియా ముఖంగా తేల్చి చెప్పిన బండారు పక్షం రోజులు తిరగక ముందే పంచకర్లకు దగ్గరయిపోయారు. అధిష్టానం పదవి ఎర వేయడంతో రాజకీయంగా బద్ధ శత్రువు అయిన పంచకర్లకు మద్దతుగా నిలవడం స్థానికంగా చర్చనీయాంశం అయింది.

34 మంది వలంటీర్ల రాజీనామా

పరవాడ: సేవా దృక్పథంతో ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేసిన తమను ప్రతిపక్షాలు అవహేళన చేస్తున్నందుకు నిరసనగా తామంతా రాజీనామాలు చేస్తున్నామని వాడచీపురుపల్లి 1, 2 గ్రామ సచివాలయాల వలంటీర్లు బుధవారం ప్రకటించారు. వాడచీపురుపల్లిలోని రెండు గ్రామ సచివాలయాలకు చెందిన 34 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పటాన్నాయక్ సమర్పించారు. జగనన్న ప్రభుత్వం ఏర్పాటైన దగ్గర నుంచి 57 నెలల పాటు ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేశామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు, వివిధ రకాల సర్టిఫికెట్ల మంజూరుకు లబ్ధిదారులతో దరఖాస్తులు చేయించి వారికి పథకాలు, సర్టిఫికెట్లు అందే విధంగా తమ వంతు సేవలు అందించేవారమని తెలిపారు. ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లను ప్రతిపక్షాలు చిన్న చూపు చూస్తూ విమర్శించడం, కించపర్చడం తమకు బాధ కలిగించిందని అందుకే మూకుమ్మడి రాజీనామాలు చేశామని వలంటీర్లు చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్లకు నెలకు రూ.10 వేల జీతం ఇస్తామని ప్రకటించడం చూస్తే వలంటీర్లను డబ్బుతో కొనాలని ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని స్పష్టమవుతుందని వారు పేర్కొన్నారు.


రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేస్తున్న వలంటీర్లు

ముత్తంశెట్టి నామిషనేషన్‌కు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సింహాచలం: భీమిలి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు నామినేషన్ వేసిన కార్యక్రమానికి బుధవారం 98వ వార్డు నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. అడవివరం నుంచి వీరంతా ర్యాలీగా వెళ్లారు. జై జగన్..జై ముత్తంశెట్టి అంటూ నినాదాలు చేశారు. 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, నాయకులు పీతల అప్పలరాజు, బొట్టా శ్రీను, కొలుసు ఈశ్వరరావు, గంట్ల కిరణ్, బోర కృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి, లండ భాస్కర్, ఆదిరెడ్డి, ఎస్.అప్పారావు, మజ్జి ధర్మా, బోర కృష్ణారెడ్డి, సిరిపురపు కృష్ణ, ఆకుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


ముత్తంశెట్టి నామినేషన్‌కి తరలివెళుతున్న 98వవార్డు వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఆకట్టుకున్న భక్తి సంకీర్తన గానం

సీతమ్మధార: సీతమ్మధార గురువాయురప్పన్ శ్రీకృష్ణ మందిరంలో బుధవారం వైదిక విజ్ఞాన విపంచి వ్యవస్థాపకులు భానుప్రసాద్, ఉమామహేశ్వరి దంపతుల సారథ్యంలో పి.రంగనాథ ఆచార్యులు బృందం వైఖానస ఆగమ సంప్రదాయంలో సీతారామ కల్యాణం, శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించింది. శ్రీరామచంద్ర స్వామి వారి ఊంజల్ సేవలో భాగంగా నగరానికి చెందిన శృతిలయ సాంస్కృతిక భక్తి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత స్వరార్చన అందరినీ ఆకట్టుకుంది. గాయనీ, గాయకులు వి.ప్రభాకర్, ఎం.ఎస్.మాధవ్, సత్యశ్రీ, పావని, కె.వెంకట సురేష్, నాగలక్ష్మి, శ్రీరాముడు, వేంకటేశ్వరుడిపై ఆలపించిన వివిధ భక్తి గీతాలు పరవశింపజేశాయి. ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ భక్తి సంగీత కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో మెలోడి సంస్థ కార్యదర్శి సిహెచ్.సత్యనారాయణ, కొణతాల రాజు, ఫణి స్వామి, భక్తులు పాల్గొన్నారు.


సీతారాములపై భక్తి గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

అట్టహాసంగా సీతారాముల ఆలయ ప్రారంభోత్సవం

ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: మండలంలోని గాలిభీమవరంలో పునర్నిర్మించిప శ్రీవిఘ్నేశ్వర,లక్ష్మీదేవి సహిత సీతారాముల ఆలయ ప్రారంభోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ గొర్లి రాజేష్ ఆధ్వర్యంలో స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన ,పట్టాభిషేక మహోత్సవం శాస్త్రోక్తంగా జరిపారు. ఉదయం నుంచి మండపారాధన,సర్వదేవత హోమం,విగ్రహ శిఖర యంత్ర ప్రతిష్టాపన మహోత్సవం,కల్యాణ హోమం తదితర పూజాలు నిర్వహించారు.ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

మధ్యాహ్నం స్వామివారి సన్నిధిలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. స్వామివారిని దర్శించుకొన్నవారిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గండి రవి కుమార్,పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషు బాబు, పలు గ్రామాల సర్పంచ్‌లు,పార్టీ సీనియర్ నాయకులు సబ్బవరపు నారాయణమూర్తి,దేడ్డం ప్రసాదరావు,పిల్లల అప్పలనాయుడు,గొర్లి వెంకట రమణ, దనిమిరెడ్డి శ్రీనివాసరావు,కర్రి శ్రీను,దుర్గ అప్పారావు తదితరులు ఉన్నారు.


పెద్దలతో కలిసి సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

రూ. 1.50 లక్షల విరాళం

వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్ రూ.1.50 లక్షల విరాళాన్ని సర్పంచ్ గొర్లి రాజేష్‌తో పాటు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆయనకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

28న వేపాకులతో భువనేశ్వరీదేవికి అధివాసం



దాబాగార్డెన్స్ : సబ్బవరం మండలం ఆరిపాక పంచాయతీలో వెలసిన భువనేశ్వరీదేవికి ఈ నెల 28న వేపాకులతో అధివాస మహోత్సవం నిర్వహించనున్నట్టు అమ్మవారి ఆరాధన పీఠం నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. పీఠంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న నిర్వహించనున్న అధివాస మహోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి రావాలని కోరారు.

అభాగ్యుడికి ఆశ్రయం


నరేష్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న ఏయూటీడీ సిబ్బంది

అల్లిపురం : తల్లి చనిపోయి, తండ్రి ఆదరణకు దూరమైన వ్యక్తిని నిరాశ్రయ వసతి గృహ నిర్వాహకులు ఆదుకున్నారు. దేవులపల్లి నరేష్ (30) అనే వ్యక్తి తల్లి మరణించి, తండ్రి పట్టించుకోకపోవడంతో ముడసర్లోవ ఫుట్‌పాత్‌పై దీనస్థితిలో పడి ఉన్నాడు. మద్యానికి బానిసై, ఆహారం తీసుకోకపోవడంతో లేవ లేని స్థితికి చేరుకున్నాడు. అతన్ని గుర్తించిన జీవీఎంసీ ఉద్యోగి అచ్యుతరావు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసుకు సమాచారం అందజేశారు. దీంతో ఏయూటీడీ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. నరేష్‌ను టీఏస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయ వసతి గృహానికి బుధవారం తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు. అతని వివరాలు తెలుసుకున్న ఏయూటీడీకి చెందిన వాసు డి–అడిక్షన్ సెంటర్‌లో చేర్పి చికిత్స అందజేసేందుకు ప్రయత్నిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాలకు మేలు

- ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయండి
- ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తండ్రి సత్యనారాయణ
- వాడచీరుపురుపల్లిలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం

పరవాడ: పెందుర్తి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడులను ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తండ్రి సత్యనారాయణ కోరారు. వాడచీపురుపల్లి, ఊటగెడ్డపాలెం తదితర ప్రాంతాల్లో బుధవారం అదీప్‌రాజ్, ఎంపీ బూడి ముత్యాలనాయుడుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా జగనన్న చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలంతా ఫ్యాను గుర్తుపై ఓటేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవడానికి ముందుకు రావాలని అన్నంరెడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అన్నంరెడ్డి అజయ్‌రాజ్, లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురదరాజు, పార్టీ నాయకులు కూండ్రపు సోమునాయుడు, కూండ్రపు తాతాజీ పాల్గొన్నారు.


వాడచీపురుపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న అదీప్‌రాజ్ తండ్రి సత్యనారాయణ

అప్పన్నకు ఘనంగా పుష్పయాగం


శ్రీపుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై వారం రోజులుగా నిర్వహించిన వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు బుధవారం రాత్రితో ఘనంగా ముగిశాయి. ముగింపు పురస్కరించుకుని సాయంత్రం నుంచి స్వామికి శ్రీ పుష్పయాగాన్ని విశేషంగా నిర్వహించారు. వరాహ లక్ష్మీనృసింహస్వామి కల్యాణ ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవి అమ్మవార్లను అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఆళ్వారులతో సహా శేషవాహనంపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. ద్వాదశి ఆరాధనలతో పాటు పలు రకాల పుష్పాలతో పుష్పాంజలి సేవ చేశారు. అనంతరం భోగ మండపంలో ఊంజల్‌సేవ నిర్వహించారు. భక్తులు పులకించిపోయారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు డ్యూయల్ బెంచీల వితరణ


తరగతి గదుల్లో డ్యూయల్ ఐరెన్ బెంచ్‌లు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన హంగులను సంతరించుకుంటోంది. మొదట్లో సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతులను నిర్వహించేవారు. నూతనంగా కళాశాల భవనాలను నిర్మించి అందుబాటులోకి తీసుకు రావడంతో కళాశాల ప్రాంగణంలో తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే నూతన ప్రాంగణంలోకి అడుపెట్టిన కళాశాల విద్యార్థులకు అవసరమైన వసతులు ఒక్కొక్కటిగా సమకూరుతున్నాయి. ఎన్టీపీసీ సీఎస్‌ఆర్ నిధులతో 100 డ్యూయల్ ఐరెన్ బెంచీలను సమకూర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి తెలిపారు. బుధవారం కళాశాలకు చేరుకున్న బెంచీలను ఆమె దగ్గరుండి తరగతి గదుల్లో పెట్టించారు. ఎన్టీపీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.